ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 5 ఫిబ్రవరి 2025

గోదావరిఖనికి చేరిన పాదయాత్ర

- సింగరేణిలో మారుపేర్ల బాధితులు
- ఏళ్ళుగా ఉద్యోగాల కోసం ఎదురుచూపు
- స్వాగతం పలికిన నాయకులు


పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు 8

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కృషి చేయాలి

- లక్ష డప్పులు, వెయ్యి గొంతుల సభ పోస్టర్ల ఆవిష్కరణ


జూలపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు 8

పరిషత్ ఎన్నికలకు సమాయత్తం



- మొదలైన ఎంపీటీసీ స్థానాల సవరణ
- ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు
- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో కొన్ని గ్రామాలను విలీనం చేయగా, కొన్ని గ్రామాలు ఇతర జిల్లాల్లో కలవడంతో ఎంపీటీసీ స్థానాలు చెల్లాచెదురయ్యాయి. ప్రస్తుతం ఆయా మండ లాల్లో ఉన్న గ్రామాలతో పాటు కొత్తగా చేరిన గ్రామాల ప్రకారం ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. ఆ మేరకు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి వారి నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు సేకరించి ఆ మేరకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. మండల, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం గతేడాది జూలైలో ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలనలో మండల, జిల్లా పరిషత్‌లు కొనసాగుతున్నాయి. గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది అవుతోంది. తాజాగా మున్సిపల్ పాలక వర్గాల పదవీ కాలం కూడా ముగిసింది. వీటన్నింటికీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి కాగా, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా అందుకు సిద్ధంగా ఉండేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో మొత్తం 14 మండలాలు ఉండగా, రామగుండం మినహా మిగతా 13 మండలాలు రూరల్ మండలాలుగా ఉన్నాయి. పెద్దపల్లి మండలంలో 17 స్థానాలు, సుల్తానాబాద్ మండలంలో 13 స్థానాలు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 12 స్థానాలు, ఓదెల మండలంలో 12, జూలపల్లి మండలంలో 9, ఎలిగేడు మండలంలో 6, మంథని మండలంలో 11, ముత్తారం మండలంలో 8, రామగిరి మండలంలో 13, కమాన్‌పూర్ మండలంలో 7, పాలకుర్తి మండలంలో 11, అంతర్గాం మండలంలో 7 స్థానాలు, ధర్మారం మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు, మొత్తం గతంలో 141 ఎంపీటీసీ స్థానాలు ఉండేవి. అంతర్గాం మండలం కుందనపల్లి, లింగాపూర్ ఎంపీటీసీ స్థానాలు, రామగిరి మండలం వెంకట్రావుపల్లి ఎంపీటీసీ స్థానం 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికలకు ముందు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. దీంతో ఆ మూడు ఎంపీటీసీ స్థానాలకు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీనిని ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించడంతో అప్పటి ప్రభుత్వం ఆ గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నుంచి తొలగించింది. ఆ గ్రామాల్లో ఐదేళ్లపాటు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది.

● కొత్త మండలాల ఏర్పాటయ్యేనా!

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా, ప్రతిపాదనలో ఉన్న గుంజపడుగు, గర్రెపల్లి, రాఘవాపూర్, కొలనూర్ మండలాల అంశం ఇంకా ఎటూ తేలలేదు. ఒకవైపు ఎంపీటీసీ స్థానాల సవరణ ప్రక్రియ ముగుస్తోంది. మండలాలు ఇప్పట్లో ఏర్పాటు చేస్తారా లేదా తెలియని పరిస్థితి నెలకొన్నది. బీసీ రిజర్వేషన్ల లెక్క తేలిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఆ లోపే కొత్త మండలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఎంపీటీసీ స్థానాల సవరణ ప్రక్రియ వేగంగా జరుగుతుండడంతో కొత్త మండలాల ఏర్పాటు అనుమానమేనని తెలుస్తున్నది.

● గత ఎన్నికల్లో 138 స్థానాలకు ఎన్నికలు..

2019లో జరిగిన పరిషత్ ఎన్నికల్లో 138 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం ఆ మూడు గ్రామాలకు సంబంధించిన మూడు ఎంపీటీసీ స్థానాలను అంతర్గాం, రామగిరి మండలాల్లో చేర్చారు. పాలకుర్తి మండలంలో గల మారేడుపల్లి, ఉండేడ, ముంజంపల్లి గ్రామ పంచాయతీలను జగిత్యాల

మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

తహసీల్దార్ల బదిలీలు

పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పి జగదీశ్వర్ రావును కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా, అక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఎండీ వకీల్‌ను ధర్మారం మండలానికి బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న జె సునీతను ఓదెల మండలానికి బదిలీ చేశారు. రామగిరి తహసీల్దార్ బి రాం చందర్ రావును సుల్తానాబాద్ మండలానికి, అక్కడ పని చేస్తున్న తహసీల్దార్ బి మధుసూదన్ రెడ్డిని ముత్తారం మండలానికి బదిలీ చేశారు. ఓదెల, ముత్తారం, ధర్మారం మండలాల్లో పని చేసిన తహసీల్దార్లు పి యాకన్న, పి సుమన్, ఎండీ ఆరీఫొద్దీన్‌లకు ఇంకా ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు.

నులిపురుగుల నివారణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న డాక్టర్ నిస్సిక్రిష్టా

ఎలిగేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నులిపురుగుల నివారణే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంఈవో నరేంద్రచారి, పీహెచ్‌సీ డాక్టర్ నిస్సిక్రిష్టాలు తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1-10ఏళ్ల పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. మండలంలో మొత్తం 3762 మంది పిల్లలు ఉన్నారని వారు పేర్కొన్నారు. సీఆర్‌పీ లక్ష్మీనారాయణతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈనెల 9న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు ఈనెల 9న ఆదివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ క్యాంపస్, మెట్రో పిల్లర్ 1463, హైదరాబాద్‌లో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల శాఖలలో ప్రిన్సిపాల్, లెక్చరర్స్, అడ్మినిస్ట్రేషన్ 33 కేటగిరీలలో టీచింగ్, నాన్‌టీచింగ్‌లో 500లకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని, ప్రిన్సిపాల్, లెక్చరర్ పోస్టులకు పీజీ ఉండాలని తెలిపారు. 5కాపీల బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌తో హాజరు కావలని సూచించారు.

పగలు వేడి.. రాత్రి చలి...

- క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నెల రోజుల ముందే ఎండ తీవ్రత


మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా లక్ష్మీనగర్ రోడ్డు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చేసింది.. శివరాత్రితో చలి తొలగి వేసవి వస్తుంది. కానీ ఈ యేడు ఇప్పటికే ఎండ తీవ్రత పెరిగింది. పగలు ఎండ వేడి ఉండగా తెల్లవారుజామున కొంత చలిగా ఉంటుంది. ఫిబ్రవరి మాసంలోనే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో మధ్యాహ్నం వేళ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండలు ముదురుతుండడంతో రానున్న మూడు నెలలు ఎలా ఉంటాయోనని ప్రజలు జంకుతున్నారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని వ్యాపార కూడలిలో మధ్యాహ్నం 12గంటలు దాటిన తరువాత రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి. టోపీలు, రుమాలు ధరించి ప్రజలు బయటకు వెళుతున్నారు.



● ఉష్ణోగ్రతలు ఇలా...

తేది	గరిష్ఠ	కనిష్ఠ
జనవరి 27	32.6	16.6
28	32.6,	16.0
29	31.6	18.6
30	33.2	18.0
31	33.2	18.4
ఫిబ్రవరి 1	35.6	18.4,
2	34.0,	18.4
3	35.6	18.0
4	35.2	18.4

ఎండ తీవ్రతతో ఫ్యాన్, కూలర్ల వినియోగం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. పగలు ఏసీ, కూలర్లను ప్రజలు వినియోగిస్తున్నారు.

ఖనిలో రోడ్ల విస్తరణ పనులు షురూ

● గడువు కావాలని కోరిన యజమానులు ● కుదరదన్న కమిషనర్


రోడ్ల విస్తరణలో భాగంగా ఎక్స్‌కావేటర్‌తో నిర్మాణాల తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వ్యాపార కేంద్రాల్లో రోడ్ల విస్తరణ పనులు మొదలయ్యాయి. మంగళవారం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్ణీత మార్కింగ్ ప్రకారం కట్టడాల తొలగింపు ప్రక్రియ మొదలు పెట్టారు. లక్ష్మీనగర్‌లోని అజయ్ మెడికల్ స్టోర్ నుంచి పాపులర్ షూమార్ట్ వరకు 30అడుగుల రహదారి విస్తరించేందుకు ఆర్‌డీపీ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చట్టం ప్రకారం రోడ్లు కనీసం 30అడుగులు ఉండాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటికే మార్కింగ్ ఇచ్చారు. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల సీజన్ కావడంతో గడువు ఇవ్వాలని వ్యాపారులు ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన పండుగ వరకు ఆపాలని కార్పొరేషన్ యంత్రాంగానికి సూచించారు. తరువాత స్వచ్ఛందంగా తొలగించాలని పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ రంగంలోకి దిగింది. మార్కింగ్ ప్రకారం కూల్చివేతలు తప్పవని, ఎక్స్‌కావేటర్లతో షాపుల ముందు రోడ్లపైకి నిర్మించిన గద్దెలను తొలగించారు. దీంతో పలువురు యజమానులు కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీని కలిసి తమకు గడువు కావాలని కోరారు. ఇప్పటికే అధిక గడువు ఇచ్చామని, కుదరదంటూ ఆమె ఖరాఖండిగా చెప్పినట్టు తెలుస్తుంది. గోదావరిఖని వ్యాపార కేంద్ర మైన లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజార్ ప్రాంతాల్లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలకు రూ.35కోట్లు కేటాయించారు. పనులు కూడా మొదలయ్యాయి. కానీ రోడ్ల విస్తరణ జరుగకపో డంతో పెండింగ్‌లో ఉన్నాయి. అజయ్ మెడకల్ స్టోర్ నుంచి బాలాజీ స్వీట్ హౌస్ వరకు 30అడుగులు, మార్కండేయకాలనీ గణేష్‌నగర్ బోర్డు నుంచి విజయ హాస్పిటల్ వరకు 30అడుగులు, రీగల్ షూమార్ట్ నుంచి బాలాజీ స్వీట్ హౌస్ వరకు 40అడుగులు, రీగల్ షూ మార్ట్ నుంచి కళ్యాణ్‌నగర్ చౌరస్తా వరకు 40అడుగులు, ఓల్డ్ అశోక థియేటర్ నుంచి శక్తి ఎలక్ట్రికల్ మీదుగా సాయి జువెల్లర్స్ వరకు 30అడుగులు విస్తరించాల్సి ఉంది. ఇప్ప టికే మార్కెండేయకాలనీ-లక్ష్మీనగర్ లింకు రోడ్డులో ప్రజలు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. కానీ వ్యాపార కేంద్రాల్లోని యజమానులు జాప్యం చేస్తున్నారు. కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా ఉన్న కలెక్టర్ టీయూఎఫ్ఐడీసీ పనుల జాప్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పూర్తి కానందునే పనులు మొదలు కావడంలేదని అధికారులు చెప్పడంతో విస్తరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో యంత్రాంగం రోడ్ల విస్తరణ మొదలు పెట్టింది.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

గోదావరిఖని, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) ఆర్‌జీ-1 ఏరియా ఆసుపత్రి ఏసీఎంవో కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య విభాగం క్యాన్సర్‌పై మంగళవారం ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత కరపత్రాలు అందజేశారు. క్యాన్సర్ గురించి, వాటి నివారణ చర్యల గురించి ఆర్‌జీ-1 ఏరియా ఆరోగ్య అధికారి కే పద్మ ఉద్యోగులకు వివరించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కల్వచర్లలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శరణ్యయాదవ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే అరికట్ట వచ్చన్నారు. ఆకస్మాత్తుగా బరువు తగ్గడం, గొంతు నొప్పి, అలసట, చర్మంలో మార్పు కనిపిస్తాయని పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి, మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, మేకల మారుతీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు చర్యలు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 700 ఎకరాలలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ జరిగిందని, నిర్దేశిత లక్ష్యం మేరకు వెయ్యి ఎకరాలకు సాగు పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు పురోగతిపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి కనబర్చే రైతుల నుంచి త్వరితగతిన మొక్కలకు, డ్రిప్‌కు డీడీలు కట్టించాలని అన్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన రైతుకు సబ్సిడీ అందేలా చూడాలని, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎరువుల కొరత సంబంధించి ఎక్కడైనా చిన్న సమస్య వచ్చిన వెంటనే సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు అవుతున్నాయో పక్కా వివరాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. డీహెచ్‌ఎస్‌ఓ జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిని సందర్శించిన కమిషనర్


వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం కమిషనర్ అరుణశ్రీ సందర్శించారు. నాలుగు రోజులుగా ఆసుపత్రి ఆవరణలో చెత్తను తొలగించకపోవడంతో కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పారిశుధ్య సిబ్బంది తొలగించాయి. ఆసుపత్రి ఆవరణలోని సంప్ వద్ద మురికి నీరు బయటకు వస్తుండడంతో పనులను వెంటనే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలోని అటెండర్ల వెయింటింగ్ రూమ్‌లో టాయ్‌లెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శారదానగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు పైప్ లైన్లను పరిశీలించారు. కమిషనర్ వెంట ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్ ఉన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి


కార్యదర్శులతో సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

కమాన్‌పూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త, చెదారం లేకుండా చూసే బాధ్యత కార్యదర్శిపై ఉందని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. మంగళవారం కమాన్‌పూర్ మండల కార్యాలయంలో కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు వంద శాతం పూర్తిచేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పౌరసేవలు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఆదేశించారు. శ్మశాన వాటికలో సౌకర్యాలు ఏర్పాటుచేయాలని సూచించారు. వాణిజ్య లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, సెల్‌టవర్ల పునఃరుద్ధరణల క్లియరెన్స్ ఉండాలన్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. మురికి కాలువలు శుభ్రంగా ఉండాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలని, వాటర్‌ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. డిఎల్‌పీవో కొమ్మెర సతీష్, ఎంపీడీవో గంగాల లలిత, ఎంపీవో కాట భాస్కర్, రామగిరి ఎంపీవో ఉమేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌బి, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్‌లో ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఉమ్మడి జిల్లా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఈనెల 9వ తేదీ వరకు www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉండాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 12 నుంచి 14 వరకు జరుతుందన్నారు. వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఆఫీస్ వేళల్లో నేరుగా సంప్రదించాలన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గత నెలలో కరీంనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి బంగారం, వెండి, నగదును దొంగిలించుకపోయిన కేసులో ఇద్దరు నిందితులను కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ బిల్ల కోటేశ్వర్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. కరీంనగర్ అశోక్‌నగర్‌లో జనవరి 25న తాళం వేసిన ఇంటిలో హన్మకొండకు చెందిన బంగారి నరేష్‌కుమార్, ఎండీ ఆసిఫ్ పాషా చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారు. మంగళవారం తీగలవంతెన వద్ద తనిఖీల్లో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 3 తులాల బంగారం, 20 తులాల వెండి, లక్షా 25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

కోనరావుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శివంగాలపల్లి గ్రామానికి చెందిన ఆముద రాజు గ్రామంలోని కుమ్మరిగుట్ట సమీపంలో సర్వే నంబరు 17లో వాల్టా చట్టానికి విరుద్ధంగా ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మట్టిని తీసి చదును చేస్తుండగా తహసీల్దార్ విజయప్రకాష్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చదునుకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్, ఇతర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

విధులను ఆటంకపరిచిన

చిరు వ్యాపారిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూనియర్ అసిస్టెంట్ బండారి లక్ష్మణ్ విధులను ఆటంకపరిచిన తమలపాకుల వ్యాపారి అన్వర్‌ఖాన్‌పై కేసు నమోదు చేశామని ఒకటో టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం గంజ్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి సామగ్రి తొలగిస్తుండగా అన్వర్‌ఖాన్ ప్లాస్టిక్ బాటిల్‌లో ఉన్న గుర్తుతెలియని ద్రావణాన్ని పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ తనవిధులను ఆటంకపరిచాడని లక్ష్మన్ ఫిర్యాదు చేశాడు.

రేషన్ బియ్యం పట్టివేత



తనిఖీలు చేస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బైపాస్ రోడ్డులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గ్రామ శివారులో సాయికుమార్ అనే వ్యక్తి గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరించి బైపాస్‌లోనని ఒక గదిలో నిల్వ చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు దాడి చేసి 63 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్‌పై కేసు నమోదు చేశారు. గంగాధర సివిల్ సప్లయీస్ డీటీ ఉషా, ఎఫ్ఐ అన్వర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని రేణుకా ఎల్లమ్మ గుడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎల్లమ్మగుడి తలుపుల తాళలను పగలగొట్టి విగ్ర హంపైఉన్న పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన గౌడ సంఘానికి చెందిన వారు తలుపులు పగలగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పుస్తెలతాడుతోపాటు, చిల్లర డబ్బులను దొంగిలించినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర భూమయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు కొయ్యడ సంపత్ గౌడ్, డైరెక్టర్ న్యాలం కనకయ్య గౌడ్, న్యాలం వీరయ్య గౌడ్, బుర్ర హరీష్ గౌఢ కొయ్యడ మారుతీ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంటాడిన 'విధి'



విధి నిర్వహణకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం

మహిళా ఎస్ఐ, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మృతి

వారిద్దరు విధి నిర్వహణకు తమ తమ ఇళ్ల నుంచి హుషారుగా బయలుదేరారు. వారిని 'విధి' వెంటాడింది. మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరినీ బలిగొంది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై కొక్కుల శ్వేత(30), ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. శ్వేత నడుపుతున్న కారు ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నరేష్‌ను బలంగా ఢీకొంది. అనంతరం అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొంది. దీంతో శ్వేత, నరేష్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు.





మృతి చెందిన ఎస్సై శ్వేత, నరేష్ (ఫైల్)

జగిత్యాల క్రైం/గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై కొక్కుల శ్వేత(30)తో పాటు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. ఇన్‌చార్జి ఎస్సై మాడ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల డీసీఆర్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కొక్కుల శ్వేత కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి తన కారులో జగిత్యాల వస్తోంది.

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన మల్యాల నరేష్ విధుల నిమిత్తం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు ద్విచక్ర వాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులోని వంతెన సమీపంలో శ్వేత కారు ఎదురుగా వస్తున్న నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. అదే వేగంతో కారు చెట్టుకు ఢీకొనడంతో ఎస్సై శ్వేత అక్కడికక్కడే మృతిచెందింది. ద్విచక్ర వాహనంపై ఉన్న నరేష్ రోడ్డు ప్రక్కన పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

● సీట్ బెల్ట్ పెట్టుకుని ఉంటే..

ఎస్ఐ శ్వేత సీట్ బెల్ట్ ధరించి ఉంటే కారుకు ఉన్న ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకుని ప్రమాదం నుంచి ఎస్సై బయట పడే అవకాశం ఉండేది. ఎస్సై శ్వేత కారును అదుపు చేయలేక పోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఎస్పీ అశోక్ కుమార్‌తో పాటు డీఎస్పీ రఘుచందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృత దేహాలను అప్పగించారు. నరేష్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది.



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

పోలీస్ శాఖలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ శ్వేత మృతి చెందడంతో జిల్లా పోలీస్ శాఖలో విషాదం నింపింది. నిన్నటి దాకా తమతో విధులు నిర్వహించిన ఎస్సై రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు పోలీస్ అధికారులు కంటతడి పెట్టారు. శ్వేత జిల్లాలోని వెల్గటూర్, కథలాపూర్, కోరుట్ల, పెగడపల్లి మండలాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్సై శ్వేత కుటుంబ సభ్యులను ఎస్పీ పరామర్శించారు.

నరేశ్ స్వగ్రామం ముత్యంపేటలో విషాదం

మల్యాల: నరేశ్ మృతితో మల్యాల మండలం ముత్యంపేటలో విషాదం నెలకొంది. నిరుపేద వ్యవసాయ కూలీలైన మల్యాల నర్సయ్య-లక్ష్మి దంపతుల రెండో కుమారుడైన నరేశ్ గతంలో లక్షెట్టిపేటకు రోజూ బస్సులో వెళ్లేవాడు. 15 రోజులుగా ద్విచక్ర వాహనంపై చిల్వకోడూర్ మీదుగా లక్షెట్టిపేట వెళ్తున్నాడు. గతంలో మాదిరిగా జగిత్యాల నుంచి బస్‌లో వెళ్లినా బతికేవాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ముత్యంపేటకు తీసుకువచ్చారు. మృతుడి సోదరుడు దుబాయి నుంచి మంగళవారం బయల్దేరడంతో అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నారు.

కష్టపడి చదివి.. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఎదిగి..

ఇంటి నుంచి బయల్దేరిన గంటకే మృతి

చొప్పదండి: పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని పైకి వచ్చిందుకున్న తరుణంలో రోడ్డు ప్రమాదం ఆమెను బలిగొనడం ఆర్నకొండ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఉదయం హుషారుగా ఇంటి నుంచి బయలుదేరిన గంటకే మరణవార్త విన్న తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన కొక్కుల శ్వేత గొల్లపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆర్నకొండకు చెందిన లక్ష్మీనారాయణ- సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె శ్వేత. వీరిలో శ్వేత పెద్దది. పెద్ద కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. 2016లో డిగ్రీ పూర్తి చేసిన శ్వేత పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. కష్టపడి చదివి పెద్ద ఉద్యోగం సాధించాలనే తపనతో 2019లో ఎస్ఐ ఉద్యోగాన్ని శ్వేత సాధించింది. మండలం నుంచి మహిళా ఎస్ఐగా ఎంపికై పలువురు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. జగిత్యాల జిల్లాలో ఎస్ఐగా సేవలందించింది. తమ కూతురికి ఉన్నత ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు, సోదరులు ఎంతో సంతోషపడ్డారు. చిన్న కుటుంబం నుంచి పట్టుదలతో చదివిపైకి వచ్చిన శ్వేత రోడ్డు ప్రమాదంలో మరణించడం గ్రామస్థులను తీవ్రంగా కలచి వేసింది. ఉదయం ఇంటి నుంచి శ్వేత కారులో వెళ్లి సాయంత్రానికి శవమై తిరిగి రావడంతో గ్రామస్థులను కంటతడి పెట్టించింది. పోలీసు శాఖలో చిన్న వయస్సులోనే ఎస్ఐ ఉద్యోగం రాగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందని మురిసిపోతున్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు...

ఆర్నకొండలో శ్వేత అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి లక్ష్మీనారాయణ అంత్యక్రియలను నిర్వహించగా పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు. మండలం నుంచి పలువురు నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో అంత్యక్రియలకు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడి మృతి

మస్తాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్రాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. మోర్రాపూర్ గ్రామానికి చెందిన భూక్య రాంచరణ్(16) అనే యువకుడు తన స్నేహితులు బట్టు చందు, వరుణ్ కృష్ణలతో కలిసి గ్రామంలోని చెరువును చూసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు రాంచరణ్ కాలుజారి చెరువులో పడి మునిగిపోయాడు. మృతుడి తండ్రి రవీందర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మృతుడు ఎంఎల్‌టీ కోర్సు చదువుతున్నాడు.

వృద్ధుడి ఆత్మహత్య

మానకొండూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నల్లగాశే చిన్నరాజయ్య (60) అనే వృద్ధుడు మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఊటూర్‌కు చెందిన చిన్నరాజయ్యకు కళ్లు సరిగా కనిపించకపోవడమే కాకుండా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి పశువుల పాకలో పడుకొని మంగళవారం తెల్లవారే సరికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పించిన వ్యక్తి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ వెరిఫికేషన్ కోసం తప్పుడు అఫిడవిట్ సమర్పించిన గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన నర్సింగోజు రాజేష్ కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. తమపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ చూపించి వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఎస్‌బీ విచారణలో ఒక క్రిమినల్ కేసు ఉన్నట్లు తేలింది. దీంతో దరఖాస్తుదారుడిపై కేసు నమోదు చేయాల్సిందిగా ఎస్‌బీ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు సూచించడంతో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిహరకాలనీకి చెందిన పోడపత్రం ధర్మపురి(45) అనే గల్ఫ్ ఏజెంట్‌ను మంగళవారం అరెస్ట్‌చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలకు చెందిన పడిగే శంకర్, పడిగే రమేశ్, కాలువ నవీన్‌లు నకిలీ గల్ఫ్ ఏజెంట్ అయిన ధర్మపురిని నమ్మి ఒక్కొక్కరు రూ.95వేల చొప్పున అతనికి ఇచ్చి కంపెనీ వీసా అని చెప్పి నమ్మించి మాల్దీవ్స్ దేశానికి పంపారన్నారు. మాల్దీవ్స్‌లో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులు చేయిస్తూ సరైన భోజనం, అకామిడేషన్ ఇవ్వకుండా ఇబ్బంది పడి అనారోగ్యానికి గురై మోసపోయినట్లు వారి కుటుంబ సభ్యులకు తెలపడంతో స్థానిక మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ ద్వారా పడిగే రజిత ఫిర్యాదు మేరకు ఏజెంట్‌పై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉపాధికోసం వెళ్లే యువకులు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పాత వాడకు చెందిన మంద కిషన్ అనే గీత కార్మికుడు సోమవారం సాయంత్రం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. సుగ్లాంపల్లిలోని తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో పక్క ఎముకలు, తొంటి విరిగింది. ప్రస్తుతం అతను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిషన్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కిషన్‌ను జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సారయ్య గౌడ్ తదితరులు పరామర్శించారు.

అప్పుల బాధతో గల్ఫ్ కార్మికుడి బలవన్మరణం



తిరుపతి (ఫైల్)

గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు చొప్పరి తిరుపతి (46) అప్పుల బాధతో ఇంటి ఆవరణలో ఉరేసుకుని మంగళవారం తెల్లవారుజామున బలవన్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేద కుటుంబానికి చెందిన తిరుపతి కొన్నేళ్ల క్రితం అప్పు చేసి గల్ఫ్ దేశం వెళ్లాడు. కానీ అక్కడ చాలీచాలని వేతనంతో అప్పులు తడిసిమోపెడయ్యాయి. సుమారు 16 సంవత్సరాలు దుబాయ్ దేశం వెళ్లినా అప్పులు తీరలేదు. దీంతో నాలుగు నెలల క్రితం ఇంటికి తిరిగివచ్చాడు. అనంతరం మూడు నెలల క్రితం దోహా ఖతర్ దేశం వెళ్లగా అక్కడ పక్షవాతం రావడంతో కంపెనీ యాజమాన్యం పదిహేను రోజులకే ఇంటికి తిప్పి పంపింది. దీంతో గతంలో ఉన్న అప్పులకు తోడు చికిత్స కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో మంగళవారం కోతుల దాడిలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. గ్రామానికి చెందిన తిప్పని మల్లేష్ స్థానిక ఇండియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద డబ్బులు డ్రా చేయడానికి వెళ్లగా అక్కడే ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి.

గమనించిన గ్రామస్థులు కర్రలతో కోతులను బెదిరించగా అవి పారిపోయాయని తెలిపారు. గాయపడిన మల్లేష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా నిర్వాహకులు బైండోవర్

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొల్లి సమ్మవ్వ, పెద్ద రాతుపల్లి గ్రామానికి చెందిన పూదరి సదయ్య గతంలో గుడుంబా అమ్ముతూ బైండోవర్ అయ్యారు. బైండో వర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ గుడుంబా అమ్ముతుండడంతో మంగళవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై మాట్లాడు తూ గుడుంబా అమ్మిన, తయారు చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ప్రయోగాలు చేసేదెలా సారూ..

● శిథిలావస్థలో జూనియర్ కళాశాల ల్యాబ్ గదులు

● భయం నీడలో విద్యార్థులు..



సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేక అధ్యాపకులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 532 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు శిథిలావస్థలకు చేరుకున్నాయి. ఆయా గదుల్లో ప్రయోగాలను చేసేందుకు విద్యార్థులు జంకుతున్నారు.

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన గదుల్లో పోలింగ్‌కు సంబంధించిన పరికరాలతోపాటు ఈవీఎంలను పోలింగ్ అధికారులు భద్ర పర్చారు. 1969లో కళాశాలలో నిర్మించిన గదుల కు ఏర్పాటు చేసిన సిమెంట్ రేకులు పగిలి పోవడంతోపాటు గోడలు సైతం వర్షాలకు తడిసి కూలి పోయిన వాటిల్లోనే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో కళా శాలలో చదు వుతున్న 532 మంది విద్యార్థులు తమకు సంబంధించిన ల్యాబ్ ప్రయోగాలను చేసేందుకు పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియక భయం నీడలో ప్రయోగాలు చేస్తున్నారు.

పోలింగ్ సామగ్రితో పాటు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గదుల ను ఖాళీ చేయాలని కళాశాల ప్రిన్సిపల్ పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలను అందించినా ఎలాంటి ఫలితం లేక పోవడంతో శిథిలావస్థకు చేరిన గదులల్లోనే ల్యాబ్‌లను కొన సాగి స్తున్నారు. కలెక్టర్ స్పందించి కళాశాలలో శిథిలావస్థకు చేరిన గదులను పరిశీలించి పోలింగ్ సామగ్రితో పాటు ఈవీ ఎంలు భద్రపరిచిన గదులను ఖాళీచేసి కళాశాలకు అందించాలని అధ్యాపకులతోపాటు విద్యార్థులు కోరుతున్నారు.



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శిథిలావస్థకు చేరిన ల్యాబ్ గదులు

ఎప్పుడు కూలుతుందో తెలియదు

అక్షయ, ఇంటర్ సెకండియర్ విద్యార్థి



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. ఆయా గదుల్లో ఏర్పాటుచేసిన ల్యాబ్‌లలో ప్రయోగాలు చేయాలంటే భయం వేస్తోంది. నూతన గదుల్లో పోలింగ్ సామగ్రితో పాటు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. వాటిని ఖాళీ చేయాలి.

ప్రయోగాలు చేయాలంటేనే భయం..

అల్తాఫ్, ఇంటర్ విద్యార్థి



సిరిసిల్ల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో ప్రయోగాలు చేయాలంటేనే భయంతో వణికిపోతున్నాం. కళాశాలలో సరైన గదులు లేకపోవడంతో అందులోనే ప్రయోగాలను చేసేందుకు ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వాటిని మార్పు చేయాలి.

పోలింగ్ సామగ్రిని తరలించాలి..

కనకశ్రీ విజయరఘునందన్, కళాశాల ప్రిన్సిపాల్



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1969లో నిర్మించిన రేకుల షెడ్లలోనే ప్రస్తుతం ల్యాబ్‌లు కొనసాగుతున్నాయి. గదులు శిథిలావస్థకు చేరడంతో ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలో నూతనంగా నిర్మించిన గదుల్లో పోలింగ్ సామగ్రిని ఖాళీచేయాలని కలెక్టర్‌కు పలుమార్లు వినతి పత్రాలను అందించిన ప్రయోజనం లేకుండా పోయింది. కలెక్టర్ స్పందించి గదులను ఖాళీ చేయిస్తే ల్యాబ్‌లను అందులోకి మార్పుస్తాం.



ఈ భవంతికి 84 ఏళ్లు..

నాటి పనితనానికి అద్దం పడుతున్న వైనం

రాచర్ల తిమ్మాపూర్‌లో ఆకట్టుకుంటున్న రెండంతస్తుల భవంతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దంగు సున్నం.. టేకు కల ప.. విశాలమైన స్థలంలో నిర్మించిన భవనం 84 ఏళ్లుగా చెక్కుచెదరకుం డా అప్పటి కూలీల పని తీరుకు అద్దం పడుతోంది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలోని రామగిరి మారుతిరావు ఇళ్లు ఆకట్టుకుంటోంది. రెండంతస్తుల భవనంలో విశాలమైన గదులు, విశ్రాం త గది, రెండు బెడ్ రూంలు, వంట గది, పూజ గదులతో పాటు మొత్తం 18 గదులున్నాయి. ఇప్పటికీ చెక్కుచెదరకుండా భవంతి కనిపిస్తోంది.

బ్రిటీష్ కాలంలో నిర్మాణం

మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన రామగిరి మారుతిరావు తాత నర్సింగారావు 1941లో సుమారు రూ.50వేలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణానికి దంగు సున్నం వినియోగించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. రెండంతస్తుల భవనం ముందు కమాన్, ఇంటిలోకి వెళ్లగానే హాలు, రెండు బెడ్‌రూంలు, పూజ, వంట, భోజనశాలతో మరో 4 గదులున్నాయి. పైఅంతస్తులోనూ విశాలమైన గదులను నిర్మించారు. నర్సింగారావు కుమారుడు తిరుపతిరావు వృత్తి రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన భార్య ఉమాదేవి, కొడుకు మారుతిరావులు అక్కడే ఉం టున్నారు. తిరుపతిరావు రెండేళ్ల కిందట మృతిచెందారు. గత యేడాది ఆయన సంవత్సరీకం కార్యక్రమాన్ని స్వగ్రామంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. స్వగ్రామంలోని తాతల నాటి ఇంటిని మర్చిపోకూడదని మారుతిరావు ఇటీవల రూ.5 లక్షలు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టారు. 84 ఏళ్ల భవంతిని చూసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.




భవనం కమాన్

ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హు లైన ఉమ్మడి జిల్లా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఫిబ్రవరి 9వ తేదీ వరకు వెబ్‌సైట్ cle. cgg. gov.inలో దరఖాస్తు చేసుకో వాల ని సూచించారు. ఈ నెల12 నుంచి 14 వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 0878-2268686 నంబరులో గానీ, కరీంనగర్‌లోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలోగానీ సంప్రదించాలని సూచించారు.

చిరుతల భజన వరల్డ్ రికార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కళారవళి సోసియో కల్చరల్ అసోసియేషన్, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో 15 గంటల చిరుతల భజన వరల్డ్ రికార్డు కోసం 33 జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వహణ బాధ్యులు కృపాదానం, విష్ణుదాస్ గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులను విష్ణుదాస్ గోపాలరావు, ఇంటి నంబరు. 3-101/2, అహల్యనగర్, బోర్నపల్లి, హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని, వివరాలకు 94402 39793 నంబరులో సంప్రదించాలని సూచించారు.





ఎమ్మెల్సీ బరిలో బీఆర్ఎస్ లేనట్లే..

- పార్టీలో ప్రసన్న హరికృష్ణ చేరికకు బ్రేక్..
- గ్రీన్ సిగ్నల్ ఇవ్వని అధినేత కేసీఆర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి బీఆర్ఎస్ తప్పుకున్నట్లు సమాచారం. ఎన్నికల హడావుడి ప్రారంభమైన నాటి నుంచి ఆ పార్టీ అధినాయకత్వం ఈ విషయంలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో ఎలాంటి సమావేశం నిర్వహించలేదు.. ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ శ్రేణులకు ఆదేశాలివ్వలేదు. దీంతో బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థులను నిలపకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మూడు రోజుల క్రితం ఎన్నికల విషయంలో కదలిక వచ్చింది.

కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం ప్రయ త్నించి భంగపడిన ప్రసన్న హరికృష్ణ బీఆర్ఎస్ నుం చి పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తూ అధినేత కేసీఆర్‌ను కలువడానికి ప్రయత్నించారని వార్తలు వచ్చాయి. కాదు పార్టీనే హరికృష్ణను పార్టీ అభ్యర్థిగా పోటీచేయమని ప్రతిపాదించి చర్చించిందని ప్రచారం జరిగింది. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఇంతకాలం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెబుతూ వస్తూ నాలుగు నెలలుగా ఓటరు నమోదు చేపట్టి పనిలో ప్రచారం కూడా నిర్వహించారు. ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ తర్వాతే హరికృష్ణకు అభ్యర్థిత్వం ప్రకటిస్తారని ప్రచారం జరిగింది.

బరిలోనే ఉంటానంటున్న సర్దార్ రవీందర్‌సింగ్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనకు స్వస్తి చెప్పి స్థానిక ఎన్నికలు, ప్రభుత్వ పథకాల అమలు వైఫల్యాలపై దృష్టి సారించి పార్టీశ్రేణుల్లో ఉత్తేజం నింపాలని ఆదేశించినట్లు సమాచారం. సోమవారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ శ్రేణులకు రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తానని అంటున్నారని, ఆయనకు మనం అండగా నిలుద్దామంటూ చెప్పడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. రవీందర్‌సింగ్ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటారని ఆమె చెప్పకనే చెప్పారు. దానికితోడు ప్రసన్నహరికృష్ణ బీఆర్ఎస్‌లో చేరే ఆలోచనను విరమించుకున్నారు. ఇండిపెండెంట్‌గానే బరిలో ఉంటారంటూ ఆయన సన్నిహితులు ప్రచారంలో చేయడం కూడా బీఆర్ఎస్ అభ్యర్థిని నిలపడం లేదనే అభిప్రాయానికి బలాన్ని చేకూర్చుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థులుగా పట్టభద్రుల స్థానంపై రవీందర్‌సింగ్‌తోపాటు ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌రావు కూడా ఆశలు పెట్టుకున్నారు. వీరిలో శేఖర్‌రావు ముందుగానే పార్టీ ఏ విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో తాను ఇండిపెండెంట్‌గానే పోటీచేస్తానని ప్రకటించి, ప్రచారం చేసుకుంటున్నారు.

డాక్టర్ బీఎస్ రావు పార్టీ అభ్యర్థిని రంగంలో ఉంచని నేపథ్యంలో తాను పోటీ చేయబోనని చెప్పారు. రవీందర్‌సింగ్ మాత్రం ఇప్పటికీ తన ప్రచారాన్ని కొనసాగిస్తూ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పార్టీల నేతలతో తనకున్న సంబంధాల నేపథ్యంలో ఉద్యమకారులు, అన్ని పార్టీల్లోని మిత్రులు, అసంతృప్తివాదులు తనకు ఓటు వేస్తారని, స్థానిక అభ్యర్థిగా తాను ప్రధాన పోటీదారుగా ఉంటానని ఆయన చెబుతున్నారు. ఎమ్మెల్సీ కవిత మద్దతు ప్రకటించిన నేపథ్యంలో జాగృతి శ్రేణులు రవీందర్‌సింగ్‌కు ప్రచారం చేస్తున్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి

కరీంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు రెండో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఉపాధ్యాయ స్థానానికి ఒకరు ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేముల కరుణాకర్‌రెడ్డి (తీగల ధర్మారం, ధర్మపురి), పిడిశెట్టి రాజు (వెంకటేశ్వరపల్లి, కోహెడ), టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి (మంచిర్యాల) నామినేషన్లు వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు ఎనిమిది మంది, టీచర్ స్థానానికి నలుగురు మొత్తం 12 మంది 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను అడ్డుకోవాలంటే

ఇన్నారెడ్డిని ఆశీర్వదించండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)ను అడ్డుకోవాలంటే తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డిని ఆశీర్వదించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, రవికుమార్‌తో కలిసి ఇన్నారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న యూపీఎస్ విధానాన్ని అడ్డుకోవడానికి సీపీఎస్ అభ్యర్థి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్నాడని తెలిపారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఇన్నారెడ్డి

సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి



ఎస్‌యూలో జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమర్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రాల మధ్య సమగ్ర సహకారం, సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్-2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్ మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ సరళీకరణ, ప్రైవేటీ కరణ తర్వాత భారత్ విద్యారంగంలో విజయవంతమైందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ దేశం ఇంకా అనేక రంగాల్లో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధిలోముందుకెళ్తోందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకు లపతి ప్రొఫెసర్ సాయన్న మాట్లాడుతూ భారత్ పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా అభివృద్ధి సాధించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ దేశం పారిశ్రామిక, సేవా రంగాలలో త్వరిత గతిన వృద్ధి సాధించినా వ్యవసాయ రంగం లో విప్లవాత్మకమైన మార్పులు రావాలని, అప్పుడే గ్రామీణ భారత్ అభివృద్ధి చెందుతుం దని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ లాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్. సూరేపల్లి సుజాత, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కోదూరు శ్రీవాణి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, యూజీసీ అఫైర్స్, ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



అభిరామ్



ప్రేమ్

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో 11స్టాగ్ తెలంగాణ స్టేట్ అండ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో జగిత్యాలకు చెందిన బొడిగె అభిరామ్, అలిశెట్టి ప్రేమ్‌లు అండర్-15 విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ పొడేటి శ్రీకాంత్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్నాయన్నారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమేట అశోక్ అభినందించారు.

బోనమో నమః

- బద్ది పోచమ్మకు బోనాల జాతర
- ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించిన భక్తులు



బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి అనుబంధ శ్రీబద్దిపోచమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది.. బద్దిపోచమ్మ తల్లికి ఇష్టమైన మంగళవారం బోనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళ వారం అమ్మవారికి బోనం తీసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

తెల్లవారు జామునే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మండపంలో అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలతో ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం నైవేద్యాన్ని పెట్టి శ్రీబద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని, కల్లు సాక పెడుతూ పిల్లపాపలు, పాడి పంటలు చల్లగా ఉండాలని, మళ్లీ వచ్చే యేడుకు తిరిగి వచ్చి మరింత ఘనంగా జాతర నిర్వహించు కుంటా మని మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసి పోయాయి. నెత్తిన బోనాలతో భక్తులు సుమారు రెండు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. క్యూలైన్లు త్వరగా కదిలేందుకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌చార్జీ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కాగా బద్ది పోచమ్మ ఆలయం ఎదుట బలిచ్చే జీవాలకు కల్లు సాక పెట్టేందుకు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

గల్ఫ్ బాధితులకు ఆపన్నహస్తం



దుబాయిలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు

- దుబాయిలో ఇక్కట్లు పడుతున్న వారికి అండగా యువకులు
- గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు
- 300మంది వలంటీర్లు స్వచ్ఛంద సేవ

మల్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి వెళ్లి అక్కడ అనుకోని ఆపదలో చిక్కుకున్న అభాగ్యులకు గల్ఫ్ కార్మి కుల రక్షణ సమితి అనే స్వచ్ఛంద సంస్థ అండ గా నిలుస్తోంది. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన ఆరే శేఖర్ అనే యువకుడు 15 ఏళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. మొదటి నుంచి సేవా గుణం కలిగిన శేఖర్ 2015లో గుండల్లి నర్సింహ అనే యువకుడితో కలిసి స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. 300 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

దుబాయిలో జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న కార్మికులను, అనారోగ్య బాధితు లను ఆదుకుంటున్నారు. చనిపోయిన వారి మృతదేహాలు స్వస్థలాలకు పంపించడంలో జాప్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. దుబాయి ఆమ్నెస్టితో పాస్ పోర్టులు లేక చాలా మంది విమాన టికెట్లు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా పనిచేసిన శేఖర్ తన పాత పరిచయాలతో తెలుగు వారిని స్వగ్రామాలకు రప్పించడానికి మిత్రుడు శ్రీధర్ గౌడ్ ద్వారా 560మందికి విమాన టికెట్లు సమకూర్చి ఇళ్లకు పంపించారు. మిత్రుల ద్వారా కొంత మేర డబ్బు ప్రోగు చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వేలాది మందికి అండగా..

స్వచ్ఛంద సంస్థ ప్రారంభించినప్పటి నుంచి పదివేల మందికి పైగా దుబాయి బాధితులకు అండగా నిలిచారు. కంపెనీల్లో జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు వేల మందిని ఆదుకున్నారు. ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు తదితర కారణాలతో మృతి చెందిన సుమారు వెయ్యికి పైగా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు. అనారోగ్యంతో ఆసుపత్రిల్లో చేరి బిల్లు కట్టలేని వారి గురించి కాన్సులేట్ అధికారులతో మాట్లాడి ఇప్పటి వరకు రూ.5కోట్ల వరకు మాఫీ చేయించడానికి కృషి చేశారు.

స్వస్థలాలకు పంపిం చని మృతదేహాలకు దుబాయిలోనే వీరు అంత్యక్రియలు నిర్వహిస్తారు. కంపెనీ నుంచి బయటకు వచ్చి తిండి కోసం ఇబ్బందులు పడుతున్న వారికి భోజన వసతితో పాటు ఆశ్రయం కల్పిస్తారు. జీతాలు ఇవ్వని కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరిం చడంతో పాటు తెలియక చేసిన నేరాలకు జైలు శిక్ష అనుభవిస్తున్న కార్మికులను జైలు నుంచి విడిపించి ఇళ్లకు పంపించేందుకు ఈ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. దుబాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ యువకులు అందరి మన్ననలు పొందుతున్నారు.

సమాచారం అందిస్తే చాలు

గుండల్లి నర్సింహ, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు



దుబాయిలో ఇబ్బందులు పడుతున్న వారికి మా వంతుగా సేవలు అందిస్తున్నాం. ఇబ్బందులు ఉన్న వారు మాకు సమాచారం అందిస్తే వారికి అండగా నిలుస్తాం. ఇప్పటికే వేల మందికి మా స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు అందించాం. ఇందులో మా మిత్రులు, దుబాయి అధికారుల సహకారం మరువలేనిది. భవిష్యత్తులో మా సేవలను మరింతగా విస్తృతం చేస్తాం.

సేవలతో మానసిక సంతృప్తి

ఆరె శేఖర్, ఉపాధ్యక్షుడు



దుబాయి వెళ్లకముందు మా గ్రామంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. అక్కడికి వెళ్లిన తరువాత తెలుగువాళ్లు ఎదుర్కొంటున్న కష్టాలు చూసి మనసు చలించింది. దీంతో మిత్రులతో కలిసి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశాం. అనేక మంది తమ సమస్యలను మా దృష్టికి తేవడంతో అక్కడికి వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సామాజిక సేవతో మానసిక సంతృప్తి కలుగుతుంది.



దుబాయిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువకులు,



కూలీలకు అందజేసేందుకు సిద్ధం చేసిన బియ్యం

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులతో కొండంతా రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

పరిషత్ ఎన్నికలకు సమాయత్తం!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ ఎండపల్లి మండలంలో విలీనం చేయ డంతో ఆ మండలంలో ఒక ఎంపీటీసీ స్థానం ముం జంపల్లి స్థానం తగ్గనుంది. ఈ స్థానాన్ని ఎండపల్లిలో చేరుస్తున్నారు. పాలకుర్తి మండలంలో 12 ఉన్న ఎంపీటీసీ స్థానాల సంఖ్య 11కు తగ్గనున్నది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 140 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మంథని మండలంలో గల రచ్చపల్లి నిర్వాసిత ఆర్అండ్ఆర్ కాలనీని బిట్టుపల్లిలో ఏర్పాటు చేయడంతో ఆ ఓటర్లందరినీ సూరయ్యపల్లి ఎంపీటీసీ స్థానంలో చేర్చారు. ఉప్పట్ల ఎంపీటీసీ స్థానంలో గల మల్లెపల్లిని కన్నాల ఎంపీటీసీ స్థానంలో చేర్చారు.

వైభవంగా రథోత్సవం



గుడిపెల్లిలో రథం ఎదుట మహిళల కోలాటం

పాలకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుడిపెల్లి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రథోత్సవంతో ముగిశాయి. స్వామి వారి ప్రతిమలను రథంపై ఊరేగించారు. రథం ఎదుట మహిళల కోలాటం, నృత్యాలు నిర్వహించారు. రథోత్సవానికి సమీప గ్రామాల ప్రజలతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ మంజూరు

ముత్తారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తీసుకువెళ్ళారు. దీంతో హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించి రూ. లక్ష ఎల్ఓసిని మంజూరు చేశారు. బాధిత కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కరీంనగర్ మాజీ మేయర్, పౌర సరఫరాల సంస్థ రాష్ట్ర మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో సమావేశమయ్యారు. పట్టభద్రులు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. నిరుద్యోగులకు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మాజీ జడ్పీటీసీ ఐల రమేష్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుమ్ముధూళితో ఇబ్బందులు

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో ప్రధాన రోడ్డులో తీవ్రమైన దుమ్ముధూళితో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు వాహద్, నాయకులు గాజుల అరుణ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం కమిషనర్ నియాజ్‌ను కలసి ఐబీ చౌరస్తా నుంచి కోర్టు ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాలకు వేళ్లే రోడ్డు వాహనాల రాకపోకలతో దుమ్ముతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం

రామగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామగిరి తహసీల్దార్ రాంచందర్ రావుకు మంగళవారం సుల్తాన్‌బాద్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ముత్తారం తహసీల్దార్ సుమన్ రామగిరి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న రాంచందర్‌రావును మాజీ జెడ్పీటీసీ గంట వెంకరమణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, మాజీ సర్పంచ్ బుద్దార్థి బుచ్చయ్య, కొప్పుల సునీల్‌లు సన్మానించారు.

ఈసాలతక్కళ్లపెల్లి ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

పాలకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపెల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా రెడపాక రాములును నియమించారు. మంగళవారం మండల అధ్యక్షుడు వడ్డెపల్లి శైలెందర్ నియామకపు పత్రాన్ని రాములుకు అందించారు. ఉపాధ్యక్షుడిగా చంద్రయ్య, కాంపెల్లి లింగయ్య, ప్రధానకార్యదర్శిగా గాలిపెల్లి వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా నెరువట్ల పెద్దమల్లేశం, నారాయణ, ఆర్గనైజర్ కార్యదర్శులుగా నెరువట్ల రవి, లింగయ్య, కోశాధికారిగా రాయలింగు, పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఎలిగేడు, ఫిబ్రవరి 4,(ఆంధ్రజ్యోతి) : సుల్తాన్‌పూర్ గ్రామానికి వచ్చిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డిని మంగళవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు రాయపాక మనోహర్, బీజేపీ సీనియర్ నాయకులు గాదె రంజిత్‌రెడ్డి, గంగయ్య, కీర్తి లింగమూర్తిలు సన్మానించారు.

శుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యం

పాలకుర్తి,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీవో ఉప్పు సుదర్శన్ తెలిపారు. మంగళవారం బసంత్‌నగర్‌లో మిషన్ భగీరథ అధికారులతో కలిసి తాగునీటి బావులను, ఓవర్ ట్యాంకులను పరిశీంచారు.

కుటుంబాన్ని పగబట్టిన విధి

- పది రోజుల క్రితం భర్త , మూర్ఛవ్యాధితో కూతురు మృతి
- అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కుమారుడు

మంథని/మంథనిరూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబంపై విధి పగబట్టింది. గుంజపడుగు గ్రామంలో పది రోజుల వ్యవధిలోనే అనారోగ్యంతో తండ్రి, కూతురు మృత్యువాత పడగా రక్తహీనతతో కొడుకు ఆసుపత్రి పాలయ్యాడు. తండ్రి కర్మకాండలు పూర్తి కాక ముందే కూతురు మృతి చెందడం, కుటుంబ పరిస్థితిని చూసిన వారు అయ్యోపాపం అంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంజపడుగ గ్రామానికి చెందిన అక్కపాక సాయికృత(2) మంగళవారం మూర్ఛ వ్యాధితో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. తండ్రి అక్కపాక నరేష్ అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గోదావరిఖనిలో జనవరి 26న మృతి చెందాడు.



సాయికృత(ఫైల్)

నరేష్ కుమారుడు విఘ్నేష్ రక్తహీనతతో బాధపడుతుండగా సోమవారం అతన్ని చికిత్స కోసం కరీంనగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. మంగళవారం ఉదయం చిన్నారి ఫిట్స్ రావడంతో చికిత్స కోసం తరలిస్తున్న సమయంలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కండ్ల ముందే భర్తను, బిడ్డను కోల్పోయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కొడుకును చూసి తల్లి రోదిస్తున్న తీరు అందిరిని కలిచి వేసింది.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



కనగర్తి లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణ

ఓదెల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుందని ఏసీపీ కృష్ణ అన్నారు. కనగర్తిలో మంగళవారం 15 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం మాట్లా డుతూ సీసీ కెమెరాలు లేకుంటే నేరాల నియంత్రణ కష్టమవుతుందని, అలాగే విచారణలో తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. సుల్తానా బాద్ సిఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్, విపిఓ రాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో సీసీ కెమెరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో కోటి రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయక పోవడంతో వాటిని మరమ్మతులు చేయించడంతో ఎక్కడి కక్కడ వ్యాపారులు, ప్రజల సహకారంతో కమ్యూనిటీ కెమెరాలు ఏర్పాటు చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్ సెంటర్‌లో 8 కెమె రాలు వ్యాపారులు ఏర్పాటు చేయగా 9కెమెరాలు కమ్యూ నిటీ పోలీసింగ్‌లో ప్రజల సహకారంతో ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు కెమెరా ఏర్పాట్లను పరిశీలించారు. వ్యాపారులు, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఇన్‌చార్జి లావణ్య అన్నారు. మంగళవారం పెద్దబొంకూరు మథర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతి బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జన సమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీం నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు 6303923700 కి ఫోన్ చేసి సమస్యను వివరించాలన్నారు. ఆత్యాశాకు పోయి క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, లోన్ యాప్స్ బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురవుతే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు స్నేహలత, మౌనిక, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం

ముత్తారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సురేష్ ఆధ్వర్యంలో ఓటరు జాబితాలో తప్పులు, కొత్త ఓటర్లను చేర్పించాలన్న పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలన్నారు. ఎన్నికల్లో కేడర్లను సామరస్యంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, పోతుపెద్ద కిషన్ రెడ్డి, బిరుదు గట్టయ్య, లక్కం ప్రభాకర్, ఎంపీఓ గోవర్ధన్ లు పాల్గొన్నారు.

మండలంలో పెరిగిన ఓటర్లు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలలో గతంలో ఉన్న ఓటర్ల కంటే 519 మంది ఓటర్లు పెరిగారని ఎంపీడీవో సురేష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 23,265 ఓటర్లు ఉండగా పురుషులు 11,369, మహిళలు 11,895 ఓటర్లు ఉండగా కొత్తగా 519ఓటర్లు పెరిగారని వారు తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసుకొని కొత్త ఓటర్లు అయిన తప్పులు ఉన్న ఓటర్లు సరి చేసుకోవాలని వారు సూచించారు.

ఓటరు జాబితాకు ఆమోదం

ధర్మారం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 29 గ్రామ పంచాయతీల ఓటరు తుది జాబితా అధికారులు ఆమోదించారు. ఎంపీడీఓ ఐనాల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో అధికారులు సమావేశమై అభ్యంతాలు ఉంటే దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎంపిఓ కె.రమేష్, సూపరెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పట్టపగలే విద్యుత్ వెలుగులు



మూలసాలలో వెలుగుతున్న వీధి దీపం

పెద్దపల్లి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పట్ట పగలే విద్యుత్ వెలుగులు కనిపిస్తున్నాయి. మండలంలోని మూలసాలలో పగలు వీధి దీపాలు వెలుగుతున్నా వాటిని నిలిపివేసే వారు కరువయ్యారు. విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సన్మానం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూరు గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా మిట్టపల్లి శ్రీనివాస్ మూడోసారి ఎన్నిక కాగా మంగళవారం సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంగల కనుకయ్య సన్మానించారు. పద్మశాలి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. వేముల రాంచంద్రం, వీరేశం, శ్రీనివాస్, మెరుగు లింగమూర్తి, నరేష్, కల్వల రాకేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రామగుండం సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్‌ను సోమవారం రాత్రి అడ్డగుంటపల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాజ్‌కుమార్ యోగక్షేమాలను తెలుసుకున్నారు. నాయకులు మహంకాళి స్వామి, నజీమోద్దీన్, గట్ల రమేష్, కుడుదుల శివ ఉన్నారు.

రామగుండంలో పారిశుధ్య మెరుగునకు చర్యలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. మంగళవారం వివిధ డివిజన్లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లను జీపీఎస్‌తో ట్రాకింగ్ చేస్తున్నామని, వాహనాల కదిలికలను మానిటరింగ్ చేస్తున్నామన్నారు. 36వ డివిజన్‌లో స్వచ్ఛ ఆటో రోజుకు రెండు ట్రిప్పుల బదులు ఒక ట్రిప్పు చెత్త తరలించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. 42, 46 డివిజన్లలోని మురికి కాలువలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రి నుంచి డ్రైనేజీ వ్యవస్థను ప్రధాన కాలువలకు అనుసంధానించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఆఫీస్ నుంచి ఫైవింక్లయిన్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రామగుండం రైల్వే స్టేషన్ ఏరియాలో ప్రధాన రహదారి డివైడర్‌లో ముళ్ల పొదలు తొలగించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాథోడ్, కుమారస్వామి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కృషి చేయాలి



ధర్మారంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జూలపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈనెల 7న మందక్రిష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యిగొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. మంగళవారం మండలకేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అంబాల రాజెందర్, మండల అధ్యక్షుడు ఎక్కిరాల స్వామి, మామిడిపెల్లి కాంతయ్య, సీపెల్లి అంజయ్య, కన్నం రాంనారాయణ, నెరువట్ల రామస్వామి, చిలు ఆనంద్, వడ్లూరి అంజయ్య పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న జరుగనున్న లక్ష డబ్బులు-వేల గొంతులు కార్యక్రమానికి భారీ ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మద్దునాల మల్లేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కుల సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. డబ్బుతో బహిరంగ సభకు రావాలని ఆయన సూచించారు. ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి సాతరాజుల సుమన్, ముఖ్యనాయకులు స్వామి. గొట్టె లింగయ్య, దూడ సురేష్, ఏఎంసి డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, శ్రీనివాస్, మానుపాటి నరేష్, మల్లేశం, ఎల్తూరి మల్లేశం, రాజేందర్, దూడ శ్రీధర్, గాజుల ఎల్లయ్య, ఎద్దుల స్వామి, రాజేశం పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన కలెక్టర్



పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువ మంది రెవెన్యూ సమస్యలతోనే సతమతం అవుతుంటారని, వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సంఘం జిల్లా ప్రతినిధులు, కలెక్టరేట్ ఏవో డి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు ప్రకాశ్, సునీత, తహసిల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలలో రథసప్తమి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం శ్రీవాణిహైస్కూల్ విద్యార్థులు సూర్య నమస్కారాలు చేయించారు. యోగా శిక్షకులు బాలయ్య, కరస్పాండెంట్ లక్ష్మణ్ కుమార్, పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారంతో విద్యార్థులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. మండ లంలోని పలు ప్రభుత్వ హైస్కూల్స్‌తో పాటు పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రాజయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు టి దివాకర్, రత్నాకర్ రెడ్డి సీఆర్పీలు సదానందం, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

రామగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ శివారులో గల ఎస్ఎస్-76 ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీకి గురైంది. రాంపెల్లి చిన్నయ్య ఇచ్చిన సమాచారం మేరకు ఏఈ మహేందర్‌రెడ్డి సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. కాపర్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని విలువ సుమారు రూ. 10వేల వరకు ఉంటుందని అంచన.

బీసీలను తక్కువ చూపించడం సరికాదు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడకగా సర్వే చేసి బీసీ లెక్కలను తక్కువచేసి చూపించడం బీసీలను అవమానించడమేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2014లో బీసీలు 51శాతం ఉంటే 2024లో 46శాతం ఉంటారా అని ప్రశ్నించారు. కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడడానికి అగ్రకులాల జనాభాను చూపించడం పెద్ద కుట్రఅన్నారు. బుధవారం బీసీ సంఘాలు, మేధావులతో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్

ఎలిగేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీవో ఎండి.ఆరీఫ్‌లు అన్నారు. మంగళవారం శివపల్లిలోని మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు, హ్యాండ్‌బోర్లను పరిశీలించారు. గేట్‌వాల్ సమస్యలు, పైపులైన్ లీకేజీలు ఉండకుండా చూడాలన్నారు. కార్యదర్శి శ్రావణ్‌కుమార్, గ్రామపంచాయతీ, మిషన్‌భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

సరైన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలి

ముత్తారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు సరైన ధ్రువపత్రాలతో కలిగి ఉండాలని ఎస్సై గోపతి నరేష్ అన్నారు మంగళవారం లక్కారంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు చర్యలు చేపడతామని హెచ్చరించారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన సీపీ

కమాన్‌పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కమాన్‌పూర్ మహిళ పోలీసులు రాణించారు. కూరపాటి శ్రీలతరెడ్డి కబడ్డీతో పాటు యోగాలో రాణించి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ఎలుకపల్లి జాహ్నవి జిమ్నాస్టిక్‌లో వాల్టింగ్ టేబుల్‌లో కాంస్య పతకం సాధించారు. కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కూరపాటి శ్రీలత కెప్టెన్‌గా వహించారు. యోగాలో సిల్వర్ మెడల్ సాధించి సీపీ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకొన్నారు. వీరిని సీపీ ఎం.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ రమేష్, టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు, కమాన్‌పూర్ ఎస్సైలు కొట్టే ప్రసాద్, రవళి, సిబ్బంది అభినందించారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

అంతర్గాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా నాయకుడు రామాచారి అన్నారు. మంగళవారం రామగుండం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. సామాన్య ప్రజలకు కొనుగోలు శక్తిని పెంచేలా, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేలా బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. బిక్షపతి, లక్ష్మారెడ్డి, మల్లేష్, దాసరి కృష్ణ పాల్గొన్నారు.



సింగరేణిని ముంచింది కేసీఆర్, కవితలే

గోదావరిఖని, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీపై, కాంగ్రెస్‌పై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు ఐఎన్‌టీయూ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 ఏళ్లు సింగరేణిని నిండా ముంచి ఇప్పుడు నీతి వాఖ్యలు చెబుతున్నారన్నారు. మారు పేర్ల మార్పు గురించి మాట్లాడిన కవిత బీఆర్ఎస్ పదేళ్లలో ఏం చేశారో చెప్పాలని, తను ఎంపీగా ఉన్నపుడు బొగ్గు బ్లాకుల వేలం వేయటం కోసం బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండీఆర్ యాక్ట్ మద్దతు తెలిపిన సంగతి తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో కార్మికులకి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కోటి రూపాయల ప్రమాద బీమా ప్రారంభించామని, ఒప్పంద కార్మికులకు రూ.40లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించామన్నారు. డిపెండెంట్ కార్మికుల వయోపరిమితి 35 నుంచి 40సంవత్సరాలకు పెంచామని, నూతన బొగ్గు గనుల ప్రారంభానికి కృషి చేస్తున్నామని, పదేళ్లలో నైనీ బ్లాకులో తట్టెడు మట్టి కూడా తీయని బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ఏర్పడిన వెంటనే ఉత్పత్తి మొదలు పెట్టామన్నారు.

కాంట్రాక్టర్‌పై ఐఎన్‌టీయూసీ నాయకుడి దాడి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2 ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ శంకర్‌నాయక్ మంగళవారం సింగరేణి కాంట్రాక్టర్ కల్లూరి తిరుపతిపై దాడికి పాల్పడ్డాడు. పోతనకాలనీ చౌరస్తా వద్ద సివిల్ పనులకు సంబంధించి టెండర్ భూపాలపల్లికి చెందిన బూక్య విజయ్ అనే కాంట్రాక్టర్‌కు వచ్చింది. విజయ్ మరో కాంట్రాక్టర్ కొల్లూరి తిరుపతితో కలిసి కార్మికులతో పనులు చేయిస్తుండగా శంకర్‌నాయక్ అక్కడికి వచ్చాడు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ ఎలా పనిచేస్తావని బెదిరిస్తూ పనులు నిలిపివేయించాడు. అంతటితో ఆగకుండా కర్రతో మరో కాంట్రాక్టర్ అయిన తిరుపతిని చితకబాదాడు. గాయపడ్డ తిరుపతి గోదావరిఖని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శంకర్‌నాయక్ దాడి చేసిన విషయమై మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్ళారు.

కాగిత రహిత విధానం అమలుపై అవగాహన



అవగాహన సదస్సులో జీఎం సుధాకర్‌రావు, అధికారులు

రామగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ-ఆఫీస్ విధానం అమలుపై మంగళవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మాట్లాడుతూ నోట్‌ఫైళ్లు, ఉత్తర ప్రత్యుత్తరాలు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి సులభంగా పంపించే వెసలుబాటు ఉంటుందని తెలిపారు. ఈ-సేవ విధానంతో కాగితాల వినియోగం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ ఈఆర్‌పి విభాగం ఐటి మేనేజర్ కిరణ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ హర్షప్రసాద్, అధికారులు శేఖర్‌బాబు, రఘుపతి, బండి సత్యనారాయణ, శ్రీనివాసులు, వెంకటరమణ, రాజశేఖర్, రామ్మోహన్, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, జనార్దన్‌రెడ్డి, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): సాప్ వినియోగంపై ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో ఐటీ విభాగం అధికారులు అవగాహన కల్పించారు. కార్పొరేట్ డీజీఎం(ఐటీ) హర్షప్రసాద్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్లు శంకర్, రమ్యలు ఫైల్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు, సర్క్యులర్లు సాప్ ద్వారా జరిగేలా ప్రోగ్రాంను రూపొందించినట్లు తెలిపారు. సమాచారం ఆన్‌లైన్‌లో భద్రంగా ఉంటుందని తెలిపారు. మధుసూదన్, నెహ్రూ, రాముడు, జావెద్ హుస్సేనీ, సంతోష్ కుమార్, సృజన్‌మెహ్ర, రాజాజీ, పాల్గొన్నారు.

గోదావరిఖనికి చేరిన మారుపేర్ల బాధితుల పాదయాత్ర

గోదావరిఖని, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుపేర్లతో ఉన్న డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని గోలేటి నుంచి చేపట్టిన చలో కొత్తగూడెం పాదయాత్ర గోదావరిఖనికి చేరుకుంది. మున్సిపల్ టీ జంక్షన్ వద్ద బీఆర్ఎస్, బీజేపీ, సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాల నాయకులు వారికి స్వాగతం పలికారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ మారుపేర్లతో ఉన్నారని, విజిలెన్స్ విచారణ పేరుతో కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరిగోస పడుతున్నారన్నారు. వారసత్వ ఉద్యోగం రాక శ్రీధర్ అనే డిపెండెంట్ చనిపోతే ఏ నాయకుడు మాట్లాడలేదని, ఎన్నికలకు ముందు భూపాలపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మారుపేర్లతో ఉన్న డిపెండెంట్ సమస్యలు పరిష్కారిస్తానని, ఏడాది అయినా వారి సమస్యలను పరిష్కరించ లేదన్నారు. బీజేపీ నాయకురాలు సంధ్యారాణి, సీఐటీయూ నాయకుడు తుమ్మల రాజారెడ్డి, అచ్చె వేణు ఉన్నారు.

అబద్ధపు ప్రచారం మానుకోవాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ అబద్ధపు ప్రచారం మానుకోవాలని, మోసపూరితమైన మాటలు మాట్లాడి కార్మికులకు మోసం చేస్తావని ఐఎన్‌టీయూసీ నాయకులు జనగామ శ్రీనివాస్ గౌడ్ అరగంటి కృష్ణ, బేబీ శ్రీను అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆర్జీ-1 ఓసీపీ5లో రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన నేపథ్యంలో నోటీసులు జారీ చేయగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చొరవ తీసుకొని అధికారులతో మాట్లాడి లెటర్లు రద్దు చేయించారన్నారు. కార్మికులకు ఐఎన్‌టీయూసీ చేస్తున్న సేవలను హెచ్ఎంఎస్ నాయకులు జీర్ణించుకోలేక సమస్య మేము పరిష్కరిస్తే గల్లి లీడర్ లాగా గనిపై పిట్ సెక్రటరీ లాగా వ్యవహరిస్తూ చంకలు గుద్దుకోవడం రియాజ్‌కు సరికాదన్నారు.